GSTIN-NO:36FKPSI308PIZX
epaper:tmedia.net.in
టి-మీడియా
సామాజికం... ప్రజల పక్షం
మెయిన్ : మంగళవారం- డిసెంబర్ 12-2023 పేజీలు : 3

మరోసారి కలవరపెడుతున్న కోవిడ్



టీ మీడియా, డిసెంబర్ 11, న్యూఢిల్లీ :
కరోనా కనుమరుగైపోయిందని అందరూ ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే ఇలాంటి తరుణంలోనే దేశ ప్రజానీకాన్ని మరోసారి కరోనా కలవరపెడుతోంది. అనూహ్యంగా దేశంలో కరోనా కేసులు పెరిగాయి. కేవలం ఆదివారం ఒక్కరోజే దేశవ్యాప్తంగా 166 కరోనా కొత్త కేసులు నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ సోమవారం వెల్లడించింది. తాజా కేసులతో కలిపి దేశవ్యాప్తంగా మొత్తంగా 895 యాక్టివ్ కేసులున్నాయి. కరోనా వేరియంట్ ఇన్ఫ్లూయెంజా వైరస్ వల్లే శీతాకాలంలో కరోనా కేసుల పెరుగుదలకు కారణమని కేంద్రప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కరోనా కేసులు పెరగడంతో శీతాకాలంలో అప్రమత్తంగా ఉండి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ప్రజలకు సూచించింది. కాగా, కరోనా వైరస్ వ్యాప్తి ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 4.44 కోట్ల మంది ఈ వైరస్ బారినపడ్డారు. దాదాపు 5,33,306 మంది కరోనాతో మృతి చెందారు. ప్రస్తుతం దేశంలో కరోనా మరణాల రేటు 1.19గా ఉంది. ఇక కరోనా నియంత్రణా చర్యల్లో భాగంగా.. ఇప్పటివరకు కేంద్రం 220.67 కోట్ల వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేసింది.

కార్యరంగంలోకి దిగిన మంత్రులు

- శాఖల వారీగా అభివృద్ధి పనులకు శ్రీకారం

టీ మీడియా, డిసెంబర్ 11,హైదరాబాద్:
తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మంత్రులు కార్యరంగంలోకి దిగారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల అమలుకు సర్కారు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే రెండు గ్యారంటీల అమలుకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. మహాలక్ష్మి పథకం కింద తెలంగాణ రాష్ట్రంలోని మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాన్ని ప్రారంభించారు. దీంతోపాటు రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద రోగులకు రూ.10లక్షల వరకు వైద్యచికిత్సకు అనుమతి ఇచ్చారు.

శాఖలవారీగా సమీక్షలు

సీఎంతో పాటు మంత్రులు వేగిరంగా నిర్ణయాలు తీసుకుంటూ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మంత్రులుగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే కార్యరంగంలోకి దిగారు. మంత్రులకు సచివాలయంలో కార్యాలయాలు కేటాయించడంతో వరుసగా వారు పదవీ బాధ్యతలు చేపడుతున్నారు. అనంతరం వారి వారి శాఖల పనితీరుపై అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి ఆదేశాలు జారీ చేస్తున్నారు.

మంత్రులు జిల్లాల పర్యటనలకు శ్రీకారం

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ, చేనేత, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంయుక్తంగా ఆదివారం ఖమ్మంజిల్లాలో పర్యటించి పలు అభివృద్ధి పథకాలను ప్రారంభించారు. తాము సంపదను సృష్టించి పేదలకు పంచుతామని భట్టి విక్రమార్క ప్రకటించారు.

100 రోజుల్లో ఆరు గ్యారంటీల అమలు

తాము అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఆయన చెప్పారు. బహుళార్థ సాధక ప్రాజెక్టులు, పరిశ్రమలను ప్రోత్సహించి పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇస్తామని ప్రకటించారు. సీతారామ ప్రాజెక్టును పూర్తిచేస్తామని మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమంతోపాటు ప్రయాణికుల సౌకర్యాలకు ప్రాధాన్యమిస్తామని తెలంగాణ రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు.ఆర్టీసీ విలీన ప్రక్రియపై గత ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షించడంతోపాటు ఆర్టీసీ ఆస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తామని మంత్రి ప్రకటించారు. బీసీలకు రుణాల మంజూరుకు చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. ఆర్టీసీ కార్మిక సంఘాలతో మాట్లాడి, వారి సలహాలు పాటిస్తామని మంత్రి పేర్కొన్నారు. అధికారులతో మంత్రి పొన్నం సమీక్షలు ప్రారంభించారు. జోగిపేట పట్టణంలో త్వరలో 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మిస్తామని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించారు.వైద్యశాఖ పనితీరుపై మంత్రి అధికారులతో సమీక్షించారు.

రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచడానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ చెప్పారు. పర్యావరణం, అడవుల పరిరక్షణకు పనిచేస్తానని అటవీ శాఖాధికారుల సమావేశంలో మంత్రి పేర్కొన్నారు. తెలంగాణలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తానని ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. అసెంబ్లీ ప్రాంగణంలో సీఎల్పీ, ఇతర పార్టీల కార్యాలయాలున్న భవనాన్ని తొలగించి అసెంబ్లీ ప్రాంగణాన్ని సుందరీకరిస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రకటించారు.ఏపీ శాసనసభ భవనంలో మరమ్మతులు చేసి శాసనమండలి సమావేశాలు నిర్వహిస్తామని మంత్రి చెప్పారు. పబ్లిక్ గార్డెన్ ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామన్నారు. నల్గొండ నుంచి ముషంపల్లి మీదుగా ధర్మాపురం వరకు ఉన్న రోడ్డును నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేయాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు.నకిరేకల్-నాగార్జునసాగర్ రోడ్డును పూర్తి చేసి, హైదరాబాద్-విజయవాడ రోడ్డును ఆరు లైన్లుగా విస్తారిస్తామని మంత్రి ప్రకటించారు. హైదరాబాద్-కల్వకుర్తి రోడ్డును నాలుగు లైన్లుగా మార్చే ప్రతిపాదనలపై మంత్రి సంతకం చేశారు. తెలంగాణలోని అన్ని రోడ్లను మరమ్మతులు చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రకటించారు.

ఆర్టికల్ 370 రద్దు రాజ్యాంగబద్ధమే..

- సుప్రీం కోర్టు కీలక తీర్పు

టీ మీడియా, డిసెంబర్ 11, జమ్మూ కాశ్మీర్ :
జమ్ముకశ్మీర్ కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దు అంశంపై సుప్రీం కోర్టు కీలక తీర్పు వెలువరించింది. జమ్మూకశ్మీర్ అంశంలో రాష్ట్రపతి ప్రకటనపై జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ఆర్టికల్ 370 రద్దుపై కేంద్రం వాదనలను సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. ఆర్టికల్ 370 అనేది తాత్కాలిక నిబంధన మాత్రమే అని, శాశ్వతం కాదని స్పష్టం చేసింది. ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం సోమవారం తమ నిర్ణయాన్ని ప్రకటించింది. రాజ్యాంగబద్ధంగానే ఆర్టికల్ 370 రద్దు నిర్ణయం జరిగిందని తెలిపింది. రాజ్యాంగంలోని అన్ని అంశాలూ కశ్మీర్‌కు వర్తిస్తాయని, మిగిలిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో జమ్ముకశ్మీర్ సమానమే అని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. ఆర్టికల్ 370 రద్దు వెనుక ఎటువంటి దురుద్దేశం కనిపించడం లేదని ఈ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ మేరకు కేంద్రం నిర్ణయానికి అనుకూలంగా తీర్పు వెలువరించింది. జమ్మూ కశ్మీర్ కు ప్రత్యేక హోదా కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 ని 2019 ఆగస్టు 5న కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. అనంతరం జమ్మూ- కశ్మీర్ ను రెండు కేంద్రపాలిత (జమ్మూ-కశ్మీర్, లడఖ్) ప్రాంతాలుగా ప్రకటించింది.

మధ్యప్రదేశ్ సీఎంగా మోహన్ యాదవ్

టీ మీడియా, డిసెంబర్ 11, న్యూఢిల్లీ :
మధ్యప్రదేశ్ కొత్త సీఎం ఎవరు? అన్నదానిపై వారం రోజులుగా జరుగుతున్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. మధ్యప్రదేశ్ సీఎంగా మోహన్ యాదవ్ ను ప్రకటించింది బీజేపీ అధిష్టానం. దక్షిణ ఉజ్జయిని నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన మోహన్ యాదవ్ శివరాజ్ సింగ్ చౌహాన్ క్యాబినెట్ లో విద్యాశాఖ మంత్రిగా పని చేశారు. సీఎం పదవి కోసం శివరాజ్ సింగ్ చౌహాన్, మాజీ కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్, ప్రహ్లాద్ పటేల్, బీజేపీ రాష్ట్ర చీఫ్ శర్మ, కైలాశ్ వర్గియా, జ్యోతిరాదిత్య సింధియా పోటీ పడ్డారు. చివరికి మోహన్ యాదవ్ వైపే బీజేపీ హైకమాండ్ మొగ్గు చూపింది. సీఎంగా మోహన్ యాదవ్ ను ఎంపిక చేయడంతో.. మధ్యప్రదేశ్ లో శివరాజ్ సింగ్ చౌహాన్ శకం ముగిసినట్లు అయ్యింది.మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా మోహన్ యాదవ్ ని బీజేపీ శాసనసభా పక్ష సమావేశంలో ఎంపిక చేశారు. 163 మంది ఎమ్మెల్యేలు ఈ సమావేశంలో తమ నేతగా మోహన్ యాదవ్ ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఢిల్లీ నుంచి వెళ్లిన పరిశీలకులు సమక్షంలో భోపాల్ లో జరిగిన సమావేశంలో మోహన్ యాదవ్ ని ముఖ్యమంత్రిగా ఎంపిక చేశారు. మోహన్ యాదవ్ మూడు సార్లు ఎమ్మెల్యేగా నెగ్గుతూ వచ్చారు. దక్షిణ ఉజ్జైన్ నియోజకవర్గం నుంచి ఆయన ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన వయసు 58ఏళ్లు. ఓబీసీ సామాజిక వర్గానికి చెందిన నేత.మొత్తం 230 అసెంబ్లీ స్థానాలున్న మధ్యప్రదేశ్ రాష్ట్రానికి నవంబర్ 17న ఎన్నికలు జరిగాయి. డిసెంబర్ 3న ఫలితాలు వచ్చాయి. అప్పటి నుంచి కూడా ముఖ్యమంత్రి ఎవరు? అన్నది సస్పెన్స్ గా మారింది. కేంద్ర మంత్రులుగా ఉన్న వారు కూడా రాజీనామా చేసి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. నరేంద్ర సింగ్ తోమర్, ప్రహ్లాద్ పటేల్, జ్యోతిరాదిత్య సింధియా సీఎం రేసులో ఉన్నట్లు చర్చ జరిగింది. ఇప్పటికే ముఖ్యమంత్రిగా సుదీర్ఘ కాలం పని చేసిన శివరాజ్ సింగ్ చౌహాన్ నే కొనసాగిస్తారా? లేక మారుస్తారా? అనే చర్చకు ఇవాళ్టితో తెరపడింది. శివరాజ్ సింగ్ చౌహాన్ తదుపరి ముఖ్యమంత్రిగా మోహన్ యాదవ్ ని లెజిస్లేటివ్ పార్టీ సమావేశంలో ఎంపిక చేశారు.స్పీకర్ గా నరేంద్ర సింగ్ తోమర్ పని చేయబోతున్నారు. ఇద్దరు డిప్యూటీ సీఎంలు ఉండబోతున్నట్లు సమాచారం. ఇక, క్యాబినెట్ కూర్పునకు సంబంధించి ఢిల్లీలో అధిష్టానం వద్ద చర్చలు జరగబోతున్నాయి.

బిల్లులు చెల్లించని బీఆర్ఎస్ ప్రభుత్వం

తెలంగాణ ఆవిర్భావం నాటికి బకాయిలు 1,268 కోట్లు

- పదేళ్లలో 20 రెట్లకు పైగా పెరుగుదల
- సాగు, తాగునీటి ప్రాజెక్టులదే అధిక వాటా
- సీఎం రేవంత్‌రెడ్డికి విద్యుత్ శాఖ నివేదిక

టీ మీడియా, డిసెంబర్ 11,హైదరాబాద్:
రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ శాఖకు చెల్లించాల్సిన కరెంటు బిల్లుల మొండి బకాయిలు రూ.28,140 కోట్లు. కేంద్ర ప్రభుత్వ విభాగాలు బకాయిపడిన రూ.721 కోట్ల కరెంటు బిల్లులను కూడా కలుపుకుంటే.. మొత్తం బకాయిలు రూ.28,861 కోట్లు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 జూన్ 4వ తేదీ నాటికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన విద్యుత్ బిల్లుల బకాయిలు రూ.1,268 కోట్లు మాత్రమే ఉండగా, ఆ తర్వాత ఏటేటా భారీగా పెరిగిపోయాయి. కాళేశ్వరం తదితర ఎత్తిపోతల పథకాలు, తాగునీటి సరఫరా పథకాలు, వీధి దీపాల నిర్వహణకు వాడుకున్న కరెంటుకు సంబంధించిన బిల్లులను విద్యుత్‌శాఖకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో విద్యుత్ రంగం పరిస్థితిపై శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నిర్వహించిన సమీక్షలో రాష్ట్ర విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దీనికి సంబంధించిన వివరాలు ఆదివారం వెల్లడయ్యాయి.

సాగు, తాగు నీటి పథకాల బకాయిలు

కాళేశ్వరంతో పాటు రాష్ట్రంలోని ఇతర ఎత్తిపోతల పథకాల నిర్వహణ కోసం వాడిన కరెంటు బిల్లుల బకాయిలే రూ.14,172 కోట్లు ఉండటం గమనార్హం. తెలంగాణ ఆవిర్భావానికి ముందు ఎత్తిపోతల పథకాల కరెంటు బకాయిలు రూ.103 కోట్లు మాత్రమే. ఇక మిషన్ భగీరథ అమలుకు వాడిన రూ.3,559 కోట్ల కరెంటు బకాయిలు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సివరేజీ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ఎసబీ/జలమండలి) వాడిన రూ.3,932 కోట్ల బకాయిలు కూడా ఏళ్లుగా పేరుకుపోయాయి. గత జీహెచ్ఎంసీ

మిగతా 2 లో



యువ న్యాయవాదులకు అండగా లా నేస్తం

- సిఎం జగన్

టీ మీడియా, డిసెంబర్ 11, అమరావతి :
రాష్ట్రంలో జూనియర్ న్యాయవాదులకు 2023-24 సంవత్సరానికి సంబంధించి రెండో విడత వైఎస్సార్ లా నేస్తం నిధులను సోమవారం ఉదయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో బటన్ నొక్కి విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఎం జగన్ మాట్లాడుతూ.. జూనియర్ న్యాయవాదులకు తోడుగా నిలబడే కార్యక్రమం ఇది అన్నారు. నేడు 2807 మంది న్యాయవాదులకు మేలు చేస్తున్నామని తెలిపారు. వైఎస్సార్ లా నేస్తం ద్వారా ఇప్పటివరకు 6069 మంది న్యాయవాదులకు మేలు జరిగిందన్నారు. నాలుగున్నరేళ్లలో రూ.49.51 కోట్లు అందించామని చెప్పారు. రూ.100 కోట్లతో అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. పేదవాడి తరపున న్యాయవాదులంతా ఔదార్యం చూపించాలని కోరారు.

2,807మంది జూనియర్ లాయర్లకు నెలకు రూ.5 వేల స్టయిఫండ్ :
రాష్ట్రవ్యాప్తంగా 2,807 మంది అర్హులైన జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5,000 స్టయిఫండ్ చొప్పున ఈ ఏడాది జూలై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలలకు ఒక్కొక్కరికి రూ.30 వేల వంతున మొత్తం రూ.7,98,95,000ను వారి ఖాతాల్లో జమచేశారు. కొత్తగా లా గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన యువ లాయర్లు పఅత్తిలో నిలదొక్కుకునేలా మూడేళ్లపాటు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.60 వేల చొప్పున.. మూడేళ్లకు మొత్తం రూ.1.80 లక్షలు ప్రభుత్వం ఇస్తోంది. ఏడాదికి రెండుసార్లు నిధులు వారి ఖాతాల్లో జమ చేస్తోంది. నేడు ఇస్తున్న ఈ సాయంతో కలిపి ఇప్పటివరకు 6,069 మంది యువ న్యాయవాదులకు ఈ నాలుగున్నరేళ్లలో మొత్తం రూ.49.51 కోట్ల ఆర్థికసాయాన్ని అందించింది. న్యాయవాదుల సంక్షేమం కోసం అడ్వకేట్ జనరల్ ఆధ్వర్యంలో లా, ఫైనాన్స్ సెక్రటరీలు సభ్యులుగా రూ.100 కోట్లతో అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఏర్పాటు చేసింది.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేస్తాం

- తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

టీ మీడియా, డిసెంబర్ 11, మధిర :
రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం త్వరలో విడుదల చేస్తామని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా మధిర క్యాంపు కార్యాలయంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మధిర నియోజకవర్గం ప్రజల ఆశీస్సులతో ఉన్నత పదవి చేపట్టానని తెలిపారు. మధిర ప్రజలందరి కృతజ్ఞతలు అన్నారు. ఈనెల 14 నుండి అసెంబ్లీ సమావేశాలు ఉన్నాయన్నారు. చారిత్రాత్మక విజయం తర్వాత ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. నిధులు, నియామకాలు, ఆత్మగౌరవం కోసం తెలంగాణ సమాజం కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నారని తెలిపారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం పాలనా అంత అస్తవ్యస్తమన్నారు. రాష్ట్ర సంపద అంతా దోపిడీ గురైందన్నారు. పూర్తిగా 10 ఏళ్ళల్లో రాష్ట్రం 70 ఏళ్ళు అభివృద్ధిలో వెనకబడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయంలో ఫీడల్ వ్యవస్థ ఏర్పడిందన్నారు. ప్రభుత్వంలో ఉన్నా ప్రతి వ్యవస్థ ప్రజలకోసంమే పనిచేసేలా పాలనా కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. భారత రాజ్యంగ స్ఫూర్తితో పాలనా అందిస్తామని తెలిపారు. కుట్రపూరితమైన పాలనకు చరమగీతం పాడారని హర్షం వ్యక్తం చేశారు. మండల, జిల్లా స్థాయిలో ప్రజా దర్బార్ లు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజా సమస్యల పరిస్కారం చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రం త్వరలో విడుదల చేస్తామని అన్నారు. ఇక కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామన్నారు.

రైతుభరోసా పథకంపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

- మార్గదర్శకాలపై ప్రభుత్వం కసరత్తు
- త్వరలోనే లబ్దిదారుల ఖాతాల్లోజమ

టీ మీడియా, డిసెంబర్ 11, హైదరాబాద్:
కాంగ్రెస్ అమలు చేయనున్న రైతుభరోసా నిధులు అన్నదాతల ఖాతాల్లో ఎప్పుడు జమవుతాయనే దానిపై ఆసక్తి నెలకొంది. అయితే రేవంత్ సర్కార్ ఈ పథకం నిబంధనల్లో మార్పులు చేయొచ్చని పలువురు నేతలు సంకేతాలు ఇస్తున్నారు. తెలంగాణలో రైతు భరోసా నిధులు ఎప్పుడు విడుదల చేస్తారనే దానిపై చర్చ జరుగుతోంది. అయితే ఈ పథకం గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు తరహాలోనే ఉంటుందా ? లేక ఇందులో మార్పులు చోటు చేసుకుంటాయా ? అన్నది ఆసక్తి రేపుతోంది. ఈ క్రమంలో రైతుభరోసాపై సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. తాము హామీ ఇచ్చిన విధంగా రైతులకు, కౌలు రైతులకు ఏటా ఎకరాకు 15వేలు రూపాయలు.. వ్యవసాయ కూలీలకు ఏటా 12వేలు రూపాయలు, వరి పంటకు 500 రూపాయల బోనస్ వంటి వాటిని ఏ విధంగా అమలు చేయాలనే దానిపై చర్చించారు. సమీక్షలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు కూడా పాల్గొన్నారు.ఇదిలా ఉంటే రైతులకు ఆర్థిక సాయం విషయంలో కాంగ్రెస్ వెనక్కి వెళ్లదని ఆ పార్టీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. అయితే తాము ఇస్తామన్న సాయం అర్హులకే అందేలా సమీక్ష చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతుల పేరిట భూస్వాములకు దోచిపెట్టారని ఆరోపించారు. అందుకే తాము సమీక్ష అనగానే బీఆర్ఎస్ నాయకుల గుండెల్లో గుబులు పుడుతుందన్నారు జీవన్‌రెడ్డి. అయితే, రైతుభరోసా నిధులను త్వరలోనే లబ్దిదారుల ఖాతాల్లో వేయాల్సి ఉండటంతో.. ఈ పథకం కోసం రూపొందించాల్సిన మార్గదర్శకాలపై తెలంగాణ ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టినట్టు కనిపిస్తోంది. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేవారు.

కేసీఆర్'ని పరామర్శించిన చిరంజీవి.. !

టీ మీడియా, డిసెంబర్ 11, సోమాజిగూడ:
యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బిఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పలువురు రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు పరామర్శిస్తున్నారు. ఇవ్వాల (సోమవారం) సాయంత్రం కేసీఆర్‌ను సినీ నటుడు చిరంజీవి పరామర్శించారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని చిరంజీవి ఆకాంక్షించారు.

హామీలను నమ్మి ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేయలే

● గుత్తా సుఖేందర్ రెడ్డి

టీ మీడియా, డిసెంబర్ 11, నల్లగొండ:

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పట్ల ప్రజల్లో ఎలాంటి వ్యతిరేకత లేదని, ప్రేమ, విశ్వాసం అలాగే ఉన్నాయని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు నమ్మి ప్రజలు ఓట్లు వేశారని అనుకోవడం లేదని చెప్పారు. కేసీఆర్ రావాలి-మా ఎమ్మెల్యేలు పోవాలని ఓటర్లు అనుకున్నట్లు ఉందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కేటీఆర్ పనితీరుకు ఓట్లు పడ్డాయని తెలిపారు. నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తాను పార్టీ మారుతున్నట్లు సోషల్ మీడియాలో దుష్ప్రచారం జరుగుతుందన్నారు. పార్టీ మారాల్సిన అవసరం తనకు లేదని స్పష్టం చేశారు. రాజ్యాంగబద్ధమైన శాసన మండలి చైర్మన్ పదవీలో ఉన్నానని, తనకు ఏ పార్టీతో సంబంధం లేదని చెప్పారు. చట్టబద్ధంగా కర్తవ్యాన్ని నిర్వహిస్తానని, ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం ఉందని తెలిపారు. ప్రభుత్వానికి అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తామని తెలిపారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం కూడా సాధ్య అసాధ్యలను బేరీజు వేసుకోవాలని సూచించారు. ప్రజలకు వాస్తవ పరిస్థితి వివరించి పథకాలు అమలు చేయాలని, వాస్తవాలు చెబితే ప్రజలు తప్పకుండా అర్థం చేసుకుంటారిన చెప్పారు. బీఆర్ఎస్ అధిష్టానం కూడా ప్రజలు తమకు వ్యతిరేకంగా తీర్పు ఎందుకిచ్చారని విశ్లేషన చేసుకుంటున్నదని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని, అధికారం ఎవరికీ శాశ్వతంగా ఉండదని వెల్లడించారు. మంత్రులు చేస్తున్న వ్యాఖ్యలను పేపర్లలలో చూశానని, విమర్శలకు, ప్రతి విమర్శలకు ఇప్పుడు సమయం కాదన్నారు. పెండింగ్ పనులను పూర్తి చేస్తూ, పక్కా కార్యాచరణతో వాళ్ళు పనిచేసుకుంటు వెళ్లాలని సూచించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు రెండు మంత్రి పదవులు రావడం సంతోషంగా ఉందని చెప్పారు.

ఇద్దరు మంత్రులు జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. జిల్లాలో ఇరిగేషన్ పనులు అసంపూర్తిగా ఉన్నాయని, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వాటిపై దృష్టిపెట్టాలన్నారు. జిల్లాలో రహదారుల అభివృద్ధికి మంత్రి వెంకట్ రెడ్డి పని చేస్తారనే నమ్మకం ఉందని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా బయటకు రావాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాని తెలిపారు.

సుప్రీంను ఆశ్రయించిన మహువా

టీ మీడియా, డిసెంబర్ 11, ఢిల్లీ:



లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడంపై టీఎంసీ నేత మహువా మొయిత్రా సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఆమె కోర్టులో సోమవారం ఒక పిటిషన్ వేశారు. ఆధారాల్లేకుండా, వచ్చిన ఆరోపణలపై సరైన దర్యాప్తు చేయకుండానే తనపై చర్యలు తీసుకున్నారంటూ ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టాలని ఆమె సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరారు. ముడుపులు తీసుకుని అదానీ గ్రూపునకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో ఆమె ప్రశ్నలు అడిగారంటూ అభియోగాలు వచ్చాయి. ఆ అభియోగాలపై విచారణ జరిపిన పార్లమెంట్ ఎథిక్స్ కమిటీ 'నిజమేనని' నివేదిక సమర్పించగా.. పార్లమెంట్‌లో చర్చ జరిగిన తర్వాత లోక్‌సభ స్పీకర్ డిసెంబర్ 8వ తేదీన మహువా లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. సస్పెన్షన్ ముందు వరకు ఆమె పశ్చిమ బంగాల్‌లోని కష్ణా నగర్ ఎంపీగా ఉన్నారు.

తహసిల్దార్ కు వినతి పత్రం

టీ మీడియా, డిసెంబర్ 11, జన్నారం:



మండలంలోని జీప్ టాటా ఏసీ ఆటో ప్రైవేట్ డ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం రోజున మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రద్దు చేయాలని తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారందరూ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గెలవగానే ఆరోగ్యారెంటీలలో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అమలు చేయడంతో మా జీవనాలు రోడ్డున పడ్డాయని రోజు జీప్, టాటా ఏసీ, ఆటో ,ఏదో ఒక వాహనం నడుపుకొని జీవితాన్ని ముందుకు సాగిస్తూ ఉన్న సమయంలో సామాన్య జీవితాలు రోడ్డుగా పడేసి తట్టు ఉన్న ఈ పథకాలను రద్దుచేసి తమకు కూడా తగు న్యాయం చేకూర్చాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జీప్ టాటా ఏసీ ఆటో డ్రైవర్ యూనియన్ సామాజిక కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి ఎస్ఐ ని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ

టీ మీడియా, డిసెంబర్ 11, నల్లగొండ :

భూవివాదంలో తలదూర్చి అత్యుత్సాహం చూపించిన చింతపల్లి ఎస్ఐ సతీష్ రెడ్డిని సోమవారం ఐ.జి.పి ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు జిల్లా ఎస్పీ అపూర్వరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ వివాదాలు, సివిల్ విషయాలలో జోక్యం చేసుకోవద్దని ఎవరైనా ఈలాంటి కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని అన్నారు. కాగా, నల్లగొండ జిల్లా చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం లాకప్‌డెత్ జరిగింది. చింతపల్లి మండలం పాలెంతండాకు చెందిన సూర్యానాయక్(50)కు ఆయన సోదరుడికి మధ్య కొంతకాలంగా భూవివాదం కొనసాగుతున్నది. ఇందులో అన్నదమ్ములు ఒకరిపై ఒకరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఎస్ఐ సతీశ్‌రెడ్డి ఆదివారం సాయంత్రం సూర్యనాయక్‌తోపాటు అతని సోదరుడిని పోలీస్ స్టేషన్‌కు పిలిచి విచారణ జరిపారు. ఈ క్రమంలో సూర్యనాయక్ హైబీపీతో స్టేషన్‌లోనే కిందపడిపోయాడు. వెంటనే అతడిని బంధువులు, పోలీసులు దేవరకొండ ప్రభుత్వ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మరణించాడు.

వరంగల్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

టీ మీడియా, డిసెంబర్ 11, వరంగల్ :

వరంగల్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రాయపర్తి మండల శివారు కిష్టాపురం క్రాస్ రోడ్డులో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కోదాడ నుంచి సిమెంట్లోడుతో వరంగల్ వైపునకు వస్తున్న లారీని డ్రైవర్ కిష్టాపురం క్రాస్ రోడ్డులో రోడ్డుపై నిలిపి ఉంచి టైర్లు పరిశీలిస్తున్నాడు. ఈ క్రమంలో వెనక నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం లారీని ఢీకొనడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో ఒకరు సంగెం మండలం ఎలుగూరు రంగంపేట శివారు బికోజి నాయక్ తండాకు చెందిన బోడ తులసీరామ్ కాగా మరొక యువకుడి వివరాలు తెలియాల్సి ఉంది. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాగు భూములకే రైతుబంధు: ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

టీ మీడియా, డిసెంబర్ 11,హైదరాబాద్:

నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో 'రైతుబంధు' డబ్బులు ఎప్పుడు జమచేస్తుందనే చర్చ నడుస్తున్న వేళ హస్తం పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ టీ.జీవన్ రెడ్డి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. సాగుచేసే నిజమైన రైతులకే రైతుబంధు పెట్టుబడి సాయం అందజేసేలా ప్రభుత్వం సమీక్ష నిర్వహిస్తుందని అన్నారు. నిజమైన రైతుల ఖాతాల్లో డిసెంబరు చివరి నాటికి రైతుల అకౌంట్లలో ప్రభుత్వం డబ్బులు వేయనుందని పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా ప్రతి ఎకరాకు రూ.7500 చొప్పున సాయం అందజేయనున్నామని చెప్పారు. కొందరు భూస్వాములు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు వందల ఎకరాలను సాగు భూములుగా చూపిస్తూ రైతు బంధు సాయం పొందుతున్నారని జీవన్ రెడ్డి విమర్శించారు. దీనిపై పునరాలోచ చేస్తామని, ధరణిలో తప్పొప్పులను పరిశీలించి హామీ ఇచ్చినట్టుగా సాగుభూములకు రైతుబంధు వేస్తామన్నారు. గత ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసిందని, అయినప్పటికీ కేవలం ఆరు గ్యారంటీలతోపాటు ఇతర ప్రజా సంక్షేమ పథకాలను ఎక్కడా ఆపేదిలేదని అన్నారు. ఆదివారం సారంగాపూర్ మండలంలోని రేచపల్లిలో ఆర్టీసీ బస్సు సేవలను జీవన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

తెలంగాణ ప్రభుత్వానికి మావోయిస్ట్ నేత జగన్ పేరిట లేఖ విడుదల

టీ మీడియా, డిసెంబర్ 11,హైదరాబాద్:

తెలంగాణ రాష్ట్ర కమిటీ

పత్రికా ప్రకటన తేదీ: 10.12.2023

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. కాంగ్రెస్ అధికారం చేపట్టి ఇచ్చిన హామీలు అమలు దిశగా కసరత్తు చేస్తోంది. ఇప్పటికే మహాలక్ష్మీ పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సాఫీగా సాగుతోంది. ఇలాంటి క్రమంలో మావోయిస్ట్ పార్టీ అధికార ప్రతినిధి జగన్ అనే పేరుతో లేఖ విడుదల కావడం తీవ్ర కలకలం రేపుతోంది. ఇందులో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను టార్గెట్ చేస్తూ కీలక అంశాలను ప్రస్తావించారు. తెలంగాణలో దశాబ్దకాలం పాటు కొనసాగిన నిరంకుశ పాలనకు ప్రజలు స్వస్తి పలికారు అని పేర్కొన్నారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పై నమ్మకంతో కాదు.. బీఆర్ఎస్ పై వ్యతిరేకతతోనే కాంగ్రెస్ కు అధికారాన్ని కట్టబెట్టారని రాసుకొచ్చారు. ఇందిరమ్మ రాజ్యం అంటే దోపిడీ రాజ్యం, ఎమర్జెన్సీ విధించి దేశాన్ని అల్లకల్లోలం సృష్టించిన విషయం ప్రజలు మరిచి పోలేదని మరోసారి పాత అంశాలను గుర్తు చేస్తూ లేఖను విడుదల చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు ఎలా అమలు చేస్తుంది అని ప్రశ్నను పొందుపరిచారు. ఇప్పటికే ఐదు లక్షల కోట్ల అప్పుల్లో ఉన్న రాష్ట్రంలో మహాలక్ష్మి, రైతు బరోసా, గృహ జ్యోతి, యువ వికాసం, చేయూత లాంటి ఆరు గ్యారంటీ లకు నిధులు ఎలా సమకూర్చుతారు అని నిలదీస్తూ బహిరంగ లేఖను విడుదల చేశారు. నిత్యవసరాల ధరలు పెంచి, పన్నులు పెంచితే ప్రజలు సహించరు అని లేఖ ద్వారా హెచ్చరించారు. అలాగే ఆదివాసీల చట్టాలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న పోలీస్ క్యాంపులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. హరిత హారం వెంటనే రద్దు చేసి ఆదివాసీలపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయాలని పేర్కొన్నారు. ఆదివాసులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు 2006 అటవీ చట్టం ప్రకారం లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్‌ను పరామర్శించిన సినీ నటుడు ప్రకాశ్ రాజ్

టీ మీడియా, డిసెంబర్ 11, హైదరాబాద్ :

యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను సినీ నటుడు ప్రకాశ్ రాజ్ పరామర్శించారు. ఈ సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి.. కేసీఆర్ ఆరోగ్యపరిస్థితి గురించి ఆరా తీశారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ప్రకాశ్ రాజ్ ఆకాంక్షించారు. మాజీ మంత్రులు గంగుల కమలాకర్, మల్లారెడ్డి, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీలు మధుసూదన చారి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు, బీఆర్ఎస్ నాయకుడు చల్మడ లక్ష్మి నరసింహారావు తదితరులు కూడా కేసీఆర్ ఆరోగ్యపరిస్థితి గురించి తెలుసుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందనేది కుమారస్వామి భ్రమ

● సీఎం సిద్ధరామయ్య

టీ మీడియా, డిసెంబర్ 11, బెంగళూరు :

కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందనేది కుమారస్వామి భ్రమ అని సీఎం పేర్కొన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బీజేపీ, జేడీఎస్ నాయకులు.. నీళ్లు లేని బావిలో చేపల మాదిరిగా విలవిలలాడిపోతున్నారని సిద్ధరామయ్య విమర్శించారు. బీజేపీ, జేడీఎస్ కలిసి 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌పై పోరాడేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఆ రెండు పార్టీలు ఏకమైనప్పటికీ, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని సిద్ధరామయ్య ధీమా వ్యక్తం చేశారు.

మహిళలకు ఉచిత ప్రయాణం..

● జేబీఎస్‌లో ఆర్టీసీ ఎండీ పరిశీలన

టీ మీడియా, డిసెంబర్ 11, హైదరాబాద్ :

హైదరాబాద్‌లోని జూబ్లీ బస్ స్టేషన్‌ను సోమవారం టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన 'మహాలక్ష్మి-మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం' అమలు తీరుపై ఆయన క్షేత్ర పరిశీలన చేశారు. జేబీఎస్-ప్రజ్ఞాపూర్, జేబీఎస్-జనగామకు వెళ్లే పల్లె వెలుగు బస్సుల్లో, బాన్సువాడకు వెళ్లే ఎక్స్ ప్రెస్ బస్సులో ఉన్న మహిళా ప్రయాణికులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ప్రయాణ సౌకర్యం అమలవుతున్న తీరును వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేబీఎస్-వెంకట్ రెడ్డి నగర్(రూట్ నంబర్ 18 వీ/జే) సిటీ ఆర్డినరీ బస్సులో మెట్టుగూడ వరకు ప్రయాణించారు. అందులో మహిళా ప్రయాణికులకు జీరో టికెట్‌ను అందజేశారు. అనంతరం టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి-మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యానికి మంచి స్పందన వస్తోందన్నారు. మహిళల ప్రయాణ ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు అందుబాటులోకి తెచ్చిన ఈ పథకాన్ని.. మహిళలు, బాలికలు, విద్యార్థినులు, థర్డ్ జెండర్లు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ గొప్ప కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీని భాగస్వామిగా చేసినందుకు ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి రాజీనామా

టీ మీడియా, డిసెంబర్ 11, మంగళగిరి (గుంటూరు) :

వైసిపి నేత, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఎమ్మెల్యే పదవితో పాటు, వైసిపి పార్టీకి కూడా రాజీనామా చేశారు. సోమవారం ఉదయం తన రాజీనామా లేఖను అసెంబ్లీ స్పీకర్ కార్యాలయంలో ఇచ్చారు. మంగళగిరి నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఆళ్ల రామకృష్ణారెడ్డి అలియాస్ ఆర్కే.. ప్రత్యర్థులపై కేసులతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. నారా లోకేష్ పైన గత ఎన్నికలో ఆళ్ల రామకృష్ణారెడ్డి గెలిచారు. అయితే పార్టీకి గత కొంతకాలంగా దూరంగా ఉంటూ వస్తున్నారు.. ఎమ్మెల్యేగా అధికారిక కార్యక్రమాలకు మాత్రమే హాజరవుతూ వస్తున్న ఆయన.. పార్టీ కార్యక్రమాలకు మాత్రం దూరంగా ఉంటూ వస్తున్నారు. ఇదే సమయంలో.. మంత్రివర్గంలో తనకు చోటు దక్కకపోవడంపై కూడా ఆర్కే అసంతృప్తితో ఉన్నట్టుగా ప్రచారం జరగుతోంది. ఇదే సమయంలో.. మంగళగిరి వైసిపి ఇంచార్జ్‌గా గంజి చిరంజీవిని వైసిపి అధిష్టానం నియమించడం.. నిన్న ప్రత్యేకంగా ఆయన పార్టీ కార్యాలయాన్ని కూడా ప్రారంభించిన వేళ ఆ కార్యక్రమానికి ఆర్కేకు ఆహ్వానం లేనట్టుగా తెలుస్తోంది.

సమన్వయంతో పని చేస్తూ సాగు రంగంలో ఉత్పత్తిని పెంచాలి

● మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

టీ మీడియా, డిసెంబర్ 11, హైదరాబాద్ :

అన్ని రకాల పంటలకు తెలంగాణ నేల అనుకూలంగా ఉంటుంది. బహుశా దేశంలో ఏ రాష్ట్రానికి ఈ ప్రత్యేకత లేదని, సీజన్ల వారిగా ముందుగానే శాఖల వారీగా ప్రణాళికలు సిద్ధం చేసుకొని, అందుకు తగ్గట్టుగా రైతులను వ్యవసాయానికి సమాయత్తం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరవాత సచివాలయంలోని వ్యవసాయ శాఖ సెక్రటరీ ఛాంబర్లో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. మంత్రికి సెక్రటరీ రఘునందన్ రావు, హెచ్ఓడీ, ఇతర అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు అందరూ సమన్వయంతో పని చేసి ఉత్పత్తి పెంచి వ్యవసాయశాఖకు మంచి పేరు తేవాలని సూచించారు. వ్యవస్థలో, శాఖాపరంగా ఉన్న లోపాలను సవరించుకొని రైతులకు సంక్షేమానికి అధికారగణం పాటుపడాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని అధిక పంట దిగుబడిని సాధించడమే కాకుండా, ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం విశేషంగా కృషి చేయాలన్నారు. తద్వారా రైతులకు మంచి మద్దతు ధర లభించేలా మార్కెటింగ్ శాఖా అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తరకం పంటలను రైతులకు పరిచయం చేయాలి. మామిడి, జామ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి ఆ పంటల సాగుకు సహాయపడాలి. పాం ఆయిల్ పంట సాగు చేసే రైతులు మంచి దిగుబడి సాధిస్తున్నారు. వాళ్లకు మంచి గిట్టుబాటు ధర లభిస్తున్నది. ఆ సాగును మరింత ప్రోత్సహించాలని, అందులో అంతర పంటగా పుచ్చకాయలుపండించే విధంగా ప్రోత్సహించాలని సూచించారు.

జానారెడ్డితో సీఎం రేవంత్ భేటీ

టీ మీడియా, డిసెంబర్ 11,హైదరాబాద్:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ సీఎల్పీ నేత జానారెడ్డిని కలిశారు. జానారెడ్డి నివాసానికి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి ఆయనతో మార్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈసందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిని జానారెడ్డి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. అయితే జానారెడ్డి మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకుండా.. తన కుమారుడు జైవీర్ రెడ్డిని పోటీ చేయించి గెలిపించాడు. రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత తొలిసారిగా జానారెడ్డి ఇంటికెళ్లారు. తెలంగాణ మంత్రివర్గంలో ఇప్పటికే పదకొండు మందికి చోటు కల్పించగా.. మరో ఏడు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే సీఎం జానారెడ్డికి కలిసినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నారు.

ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో ప్రారంభిస్తాం

● మంత్రి పొన్నం ప్రభాకర్

టీ మీడియా, డిసెంబర్ 11, సిద్దిపేట :

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో ప్రారంభిస్తాం..ఇప్పటికే రెండింటిని ప్రారంభించామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం ఆయన గజ్వేల్ పట్టణంలో పర్యటించారు. ప్రగ్గాపూర్ వద్ద కాంగ్రెస్ శ్రేణులు గజ మాలతో స్వాగతం పలికాయి. అనంతరం మంత్రి గజ్వేల్ పట్టణంలోని తూముకుంట నర్సారెడ్డి స్వగృహంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. మూడో తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడితే 9వ తేదీన ఇచ్చిన 6 గ్యారంటీలలో 2 ప్రారంభించామని గుర్తు చేశారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.10 లక్షలతో ప్రారంభించామని పేర్కొన్నారు. గతం లో ఇచ్చిన విధంగానే రైతు బందు ఇస్తామని తెలిపారు. ప్రజల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

విశాఖలో జనసేన ఆందోళన

● నాదెండ్ల మనోహర్ అరెస్టు

టీ మీడియా, డిసెంబర్ 11, విశాఖ :

విశాఖలోని టైకూన్ కూడలి నుంచి వీఐపీ రోడ్డు వైపు వెళ్లే మార్గాన్ని మూసివేయడంపై %్రా% జనసేన ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నోవాటెల్ హౌటల్ వద్ద జనసేన నేతలు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ %్రా% శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు లేదా ? అని ప్రశ్నించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. వీఐపీ రోడ్డు వైపు వెళ్లే మార్గాన్ని మూసివేయడం వల్ల ప్రయాణికులు సుమారు 2 కి.మీ మేర అదనపు దూరం వెళ్లాల్సి వస్తుందని అన్నారు. విశాఖ ఎంపీ నిర్మిస్తున్న బిల్డింగ్ సేల్స్ పెంచుకోవడం కోసం ప్రజలను ఇబ్బందికి గురిచేస్తున్నారని ఆరోపించారు. వాస్తు దోషం తొలగించుకోవడానికి రోడ్లు మూసివేయడం అన్యాయమన్నారు. పోలీసు ఉన్నతాధికారులు ఆలోచన చేయాలని కోరారు. డివైడర్ తొలగించే వరకు జనసేన పోరాడుతుందని స్పష్టం చేశారు. వైసిపి ప్రభుత్వానికి ఇంకా మూడు నెలలు మాత్రమే గడువు మిగిలి ఉంది అని చెప్పారు. నిరసన స్థలం వద్దకు చేరుకున్న పోలీసులు నాదెండ్ల మనోహర్‌ను అరెస్టు చేశారు.

మహానంది క్షేత్రంలో కార్తీక శోభ

టీ మీడియా, డిసెంబర్ 11, మహానంది:

మహానంది పుణ్యక్షేత్రంలో కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా తెల్లవారుజామున నుండి భక్తుల రద్దీ కొనసాగింది. మహానంది క్షేత్రానికి వచ్చిన భక్తులు కోనేరులలో పుణ్య స్నానాలు ఆచరించి, కార్తీకదీపాలు వెలిగించి, స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఎంతో పవిత్రమైన కార్తీక సోమవారం కావడంతో క్షేత్రానికి వచ్చిన భక్తులు స్వామి వారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. క్షేత్రంలో శివనామ స్మరణలతో మారుమోగిపోయింది. క్షేత్రానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్షేత్రానికి వచ్చిన భక్తుల కోసం ఆలయ పరిసరాల్లో అన్న ప్రసాద వితరణ దాతలు ఏర్పాటు చేశారు.

మహానందిలో ఘనంగా లక్ష బిల్వార్చన పూజలు

టీ మీడియా, డిసెంబర్ 11, మహానంది:

మహానంది పుణ్యక్షేత్రంలో సోమవారం కార్తీకమాస మాసశివరాత్రి సందర్భంగా ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ మహేశ్వర్ రెడ్డి ల ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది. ముందుగా గోపూజ,గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఋత్విక్వరుణ, కంకణధారణ చేసిన అనంతరం శ్రీ మహానందీశ్వర స్వామి వారికి పీఠార్చనలు నిర్వహించి మహన్యాసం చేసి విధిగా 121 రుద్రాలతో మహా రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో దాత రామకృష్ణ విద్యాలయాల సంస్థల అధినేత రామకృష్ణారెడ్డి దంపతుల ఆర్థిక సహాయ సహకారాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు గంగిశెట్టి మల్లికార్జున, వేద పండితులు రవిశంకర అవధాని, నాగేశ్వర శర్మ, శాంతారాం బట్ తదితరులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుని సన్నిధిలో అడిషనల్ డీజీ పూజలు

టీ మీడియా, డిసెంబర్ 11, మహానంది:

మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని అడిషనల్ డీజీ త్రివిక్రమ వర్మ దంపతులు దర్శించుకుని సోమవారం రాత్రి పూజలు నిర్వహించారు.వీరికి ఆలయ సూపర్డెంట్ ఓ వెంకటేశ్వర్లు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి అభిషేకం అమ్మవారికి కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి ఏ డి జి దంపతులను దుశ్శాలు వతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఏ డి జి వెంట మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఫైళ్ల మాయంపై విచారణ వేగవంతం చేశాం

టీ మీడియా, డిసెంబర్ 11, హైదరాబాద్:

తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు మంత్రుల కార్యాలయాల్లో ఫైళ్ల మాయంపై విచారణ వేగవంతం చేశామని సెంట్రల్ జోన్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం నాడు డీసీపీ తన కార్యాలయంలో ఏబీఎన్‌తో మాట్లాడుతూ.. ఈ కేసులో డైరక్టర్‌ను విచారణ చేయాల్సి ఉంది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైల్లు, ఫర్నిచర్ మిస్సింగ్ పై దర్యాప్తు చేస్తున్నాం. పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో ఫైల్స్ మిస్సింగ్ చేసినట్లు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఓఎస్డీ కళ్యాణ్‌పై ఆరోపణలు ఉన్నాయి. కళ్యాణ్‌తో పాటు డైరెక్టర్‌ను విచారణ చేసి, స్టేట్‌మెంట్ రికార్డ్ చేస్తాం. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కార్యాలయాల్లో ఫర్నిచర్ మిస్సింగ్‌పై కూడా కేసు నమోదు చేశాం. అలాగే మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కార్యాలయంలో బిర్వాలు మిస్సింగ్‌పై కూడా కేసు నమోదు చేశాం.విద్యా శాఖలో జరిగిన సంఘటన పై దర్యాప్తు జరుగుతుంది. మాజీ మంత్రుల ప్రమేయం ఉంటే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం. విచారణలో ఎవరి ప్రమేయం ఉన్న చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం" అని డీసీపీ శ్రీనివాస్ హెచ్చరించారు.

ప్రధాన కాలువ నిర్మాణ పనులు

టీ మీడియా, డిసెంబర్ 11, గోదావరిఖని :

రామగుండం రైల్వే స్టేషన్ ఏరియా లొ సోమవారం ప్రధాన కాలువ నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన 20వ డివిజన్ కార్పోరేటర్ కన్నూరి సతీష్ కుమార్.ఈ సందర్భంగా కన్నూరి సతీష్ కుమార్ మాట్లాడుతు.. దశాబ్దాల కాలంగా సమస్యగా ఉన్న 40లక్షలతొ ప్రధాన కాలువ నిర్మాణ పనులను ప్రారంభించడమైనదనిప్రజల సహకారంతొ డివిజన్ లొ ప్రజల సహకారంతొ అన్ని రకాల అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలొఎస్.కె.బాబుమియా, ఎస్.కె.ఇంతియాజ్, కె.మల్లేష్,కె.రాకేష్, బి.మల్లేష్,సర్వర్, జి.రాజు, యం.డి.హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్‌గా వైసీసీ నిర్ణయం..

- **11 నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జ్‌ల మార్పు**

టీ మీడియా, డిసెంబర్ 11, అమరావతి:

- వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్‌గా వైసీపీ అధిష్టానం సంచలన నిర్ణయం తీసుకుంది. మొత్తం 11 నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జ్‌లను మారుస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు సోమవారం (డిసెంబర్ 11) ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి, మంత్రి బొత్స సత్య నారాయణ 11 నియోజకవర్గాల కొత్త ఇన్‌ఛార్జ్‌ల పేర్లను ప్రకటించారు కాగా 175 నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తున్న వైసీపీ.. 11 నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జులను మార్చింది. ఈ మార్పు మంగళగిరి నియోజకవర్గం నుంచే మొదలైనట్టు కనిపిస్తోంది. దాదాపుగా ఈ మార్పును ఊహించేనేమో.. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. కాకపోతే, పార్టీకి కూడా రాజీనామా చేయడమే సెన్సేషన్ సృష్టించింది. మంగళగిరి నియోజకవర్గ బాధ్యతలను ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవికి అప్పగించింది.మొత్తం 11 నియోజకవర్గాల వైసీపీ ఇన్‌చార్జ్‌లను మార్చింది అధిష్టానం. ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా బాలసాని కిరణ్‌కుమార్, కొండెపి-ఆదిమూలపు సురేష్, వేమూరు-వరికూటి అశోక్‌బాబు, తాడికొండ-మేకతోటి సుచరిత, సంతనూతలపాడు-మేరుగు నాగార్జున, చిలకలూరిపేట-మల్లెల రాజేష్‌నాయుడు, గుంటూరు వెస్ట్-విడదల రజిని, అద్దంకి-పాణెం హనిమిరెడ్డి, మంగళగిరి-గంజి చిరంజీవి, రేపల్లె-ఈవూరు గణేష్, గాజువాక నియోజకవర్గ బాధ్యతలను వరికూటి రామచంద్రరావుకు అప్పగించారు. ఈసారి బీసీ సామాజికవర్గానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలనుకుంటున్నారు సీఎం జగన్. టికెట్లు ఇచ్చే విషయంలో కొన్ని అగ్రకులాలకు కొంత ప్రాధాన్యత తగ్గించి, బీసీలకు టికెట్లు ఇవ్వాలనుకుంటున్నారు. బహుశా, ఈ విషయం గమనించే బాలినేని శ్రీనివాస్ రెడ్డి గానీ, గాజువాక నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తిప్పల దేవన్ రెడ్డి గానీ పార్టీకి కొంత నెగటివ్‌గా స్పందించారని చెప్పుకుంటున్నారు. ముఖ్యంగా గాజువాక టికెట్ ఆశించిన తిప్పల దేవన్ రెడ్డి పార్టీ పదవికి రాజీనామా చేసి అజ్ఞాతంలోకి వెళ్లారు.

నాదెండ్ల అరెస్ట్‌ను తప్పపట్టిన పవన్

- **తక్షణం విడుదల చేయాలని డిమాండ్**

టీ మీడియా, డిసెంబర్ 11, విశాఖ :

విశాఖలో టైకూన్ జంక్షన్ మూసివేతపై నిరసన తెలిపేందుకు ప్రయత్నించిన జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ మండిపడ్డారు. విశాఖపట్నంలో టైకూన్ జంక్షన్ ను మూసివేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంటే నిరసన తెలిపి ఆ కూడలిని తెరవాలని కోరిన తమ నేత నాదెండ్ల మనోహర్ ను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం అంటూ ధ్వజమెత్తారు. ప్రజల కోసం విశాఖ టైకూన్ జంక్షన్ తెరవాలని కోరితే అరెస్ట్ చేస్తారా? అంటూ ప్రశ్నించారు.. ప్రజల సమస్యలు తీర్చాల్సిన మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, పోలీసు అధికారులు అందుకు భిన్నంగా స్థానిక ఎంపీ కోసం జంక్షన్ మూసివేయడం ఏంటని పవన్ నిలదీశారు. ఆయన రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుకి వాస్తు దోషం ఉందని రోడ్డు మూసేయడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాలను ప్రజా గొంతుకగా జనసేన వినిపిస్తుందని, ఇందులో భాగంగా ప్రజాస్వామ్యయుతంగా నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు, వీర మహిళలు సన్నద్ధమైతే పోలీసులు ప్రవర్తించిన తీరును ఖండిస్తున్నామని తెలిపారు. నాదెండ్ల మనోహర్ ను, ఇతర నేతలను పోలీసులు తక్షణమే విడుదల చేయాలని పవన్ డిమాండ్ చేశారు. 'ఇదే ధోరణిలో వైసీపీ ప్రభుత్వం వ్యవహరిస్తే నేను విశాఖపట్నం బయల్దేరి వస్తాను ప్రజల తరఫున పోరాడతాను' అంటూ పవన్ కల్యాణ్ హెచ్చరించారు.

దాడులు అపకపోతే బందీలను చంపేస్తాం

టీ మీడియా, డిసెంబర్ 11, గాజా :

గాజా లో హమాస్ మిలిటెంట్ల లక్ష్యంగా ఇజ్రాయెల్ తీవ్రంగా విరుచుకుపడుతోంది. ఉత్తర గాజాలో భూతల పోరాటం ఉద్ధృతమైంది. దక్షిణ గాజాలో బాంబుల మోత మోగుతోంది. దీంతో ఖైదీల విడుదల కోసం తాము చేసిన డిమాండ్లు నెరవేరకపోతే ఇజ్రాయెల్‌కు చెందిన బందీలు సజీవంగా గాజా నుంచి బయటపడలేరని హమాస్ హెచ్చరించింది..అయితే . ఈ హెచ్చరికలను ఖాతరు చేయకుండా సోమవారం ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించింది. 'మా ఖైదీల విడుదల, చర్చలు లేకుండా ఇజ్రాయెల్ బందీలు సజీవంగా తమ స్వదేశానికి వెళ్లలేరు' అని ఆదివారం హమాస్ బెదిరించింది. గాజాలో హమాస్ చెరలో 137 మంది బందీలు ఉండగా.. 7 వేల మంది పాలస్తీనీయులు ఇజ్రాయెల్ జైళ్లలో ఉన్నారు. అక్టోబర్ 7న హమాస్ ఉగ్రదాడి అనంతరం గాజాపై ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. హమాస్ మిలిటెంట్లు వెంటనే ఆయుధాలు విడిచిపెట్టి లొంగిపోవాలని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు హెచ్చరించారు. హమాస్ ముగింపు దగ్గరపడిందని ఆయన అన్నారు. అలాగే యుద్ధం ఆపాలంటూ ఐక్య రాజ్య సమితి చేసిన వినతిని సైతం ఇజ్రాయేల్ తొసిపుచ్చి గాజాలో యుద్ధాన్ని కొనసాగిస్తున్నది.

టీఎస్ పీఎస్ సీ ఛైర్మన్ పదవికి జనార్దన్ రెడ్డి రాజీనామా

- **సీఎం రేవంత్ రెడ్డితో భేటీ తర్వాత నిర్ణయం**

టీ మీడియా, డిసెంబర్ 11, హైదరాబాద్:

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్ పీఎస్ సీ) ఛైర్మన్ పదవికి జనార్దన్ రెడ్డి రాజీనామా చేశారు. తన రాజీనామాను ఆయన గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ కి పంపారు. గవర్నర్ ఆ రాజీనామా ఆమోదించి సీఎస్ కు పంపారు. టీఎస్ పీఎస్ సీ బోర్డు తీరు తీవ్ర వివాదాస్పదమైంది. అనేక వివాదాలకు దారితీసింది. ఈ బోర్డు నిర్వహించిన పోటీ పరీక్షల పేపర్లు లీక్ అవడం, వాయిదా పడటం వంటివి నిరుద్యోగుల్లో తీవ్ర గందరగోళం సృష్టించాయి. బోర్డు పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఇంతలో ప్రభుత్వం మారిపోయింది.సీఎం రేవంత్ రెడ్డి టీఎస్ పీఎస్ సీ పై సమీక్ష నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారు, ఎన్ని నోటిఫికేషన్లు ఇచ్చారు.. ఇలాంటి అంశాలకు సంబంధించి 2 రోజుల్లో పూర్తి వివరాలతో రావాలని జనార్దన్ రెడ్డిని ఆదేశించారు సీఎం రేవంత్ రెడ్డి. అయితే, సీఎంతో భేటీ తర్వాత జనార్దన్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. టీఎస్ పీఎస్ సీ ఛైర్మన్ పదవికి రిజైన్ చేసేశారు. 2021 మే 19న %ఖూరూజ% ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించారు జనార్దన్ రెడ్డి.

ఆర్టిలక్ 370 రద్దు చారిత్రాత్మకమైన తీర్పు

- **ప్రధానమంత్రి నరేంద్రమోడీ హర్షం**

టీ మీడియా, డిసెంబర్ 11,న్యూఢిల్లీ :

ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టు ఈరోజు చారిత్రాత్మకమైన తీర్పునిచ్చింది. 370 రద్దుపై కేంద్రం తీసుకున్న నిర్ణయం సరైందేనని సుప్రీం సమర్థించింది. ఈ సందర్భంగా సుప్రీం తీర్పుపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ హర్షం వ్యక్తం చేశారు. ఆశాజనకమైన తీర్పు అని మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఈ తీర్పుపై మోడీ 'ఒకప్పటి రాష్ట్ర (ఇప్పుడు రెండు కేంద్రపాలిత ప్రాంతాలు) ప్రజల కలలను నెరవేర్చడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని పోస్టులో పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీం కోర్టు నేడు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనది. ఆగస్టు 5, 2019న భారత పార్లమెంటు తీసుకున్న నిర్ణయాన్ని రాజ్యాంగబద్ధంగా సమర్థిస్తుంది అని మోడీ అన్నారు. 'ఇది జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లోని మా సోదర సోదరీమణులకు ఒక ఆశను కల్పించింది. పురోగతితోపాటు, ఐక్యతకు నిదర్శనంగా ఈ తీర్పు ఉంది. సర్వోన్నత న్యాయస్థానం అపారమైన జ్ఞానంతో భారతీయులుగా మనం ఎంతో ప్రేమించే, గౌరవించే ఐక్యత యొక్క సారంశాన్ని బలపరిచింది. ఆర్టికల్ 370 కారణంగా నష్టపోయిన మన సమాజంలోని జమ్మూకాశ్మీర్, లడఖ్‌లోని ప్రజల కలల్ని నెరవేర్చడానికి మేము నిబద్ధతతో కృషి చేస్తామని నేను హామీ ఇస్తున్నాను. అత్యంత బలహీన, అట్టడుగు వర్గాలకు ప్రగతి ఫలాలు అందేలా చూస్తాము. ఈరోజు తీర్పు కేవలం చట్టపరమైన తీర్పు కాదు. ఇది ఒక ఆశాకిరణం. ఉజ్వల భవిష్యత్తు యొక్క వాగ్దానం. బలమైన, మరింత ఐక్యమైన భారతదేశాన్ని నిర్మించాలనే మా సమిష్టి సంకల్పానికి నిదర్శనం.' అని మోడీ తన పోస్టులో పేర్కొన్నారు.

బిల్లులు చెల్లించని బీఆర్ఎస్ ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు హైదరాబాద్ జంట నగరాల ప్రజలకు నల్లా నీళ్లను ఉచితంగా సరఫరా చేస్తుండటంతో ఆదాయం కోల్పోయిన జలమండలి విద్యుత్ బిల్లులను చెల్లించలేక చేతులెత్తేసింది. మిషన్ భగీరథ నీళ్లను సైతం గ్రామాల్లో ఉచితంగానే సరఫరా చేస్తుండటంతో ఆ విభాగం కూడా ఆదాయం లేక కరెంట్ బిల్లులను చెల్లించలేకపోయింది.

రూ.5,176 కోట్ల కరెంటు బిల్లుల నిధుల దారి మళ్లింపు

గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లుల చెల్లింపులకు సంబంధించిన రూ.3993 కోట్ల నిధులను పంచాయతీరాజ్ శాఖ ఖాతా నుంచి, మున్సిపాలిటీల విద్యుత్ బిల్లుల చెల్లింపులకు సంబంధించిన రూ.1183 కోట్లను రాష్ట్ర పురపాలక శాఖ ఖాతా నుంచి.. మొత్తం రూ.5,176 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాకు దారి మళ్లించింది. ఈ నిధులు రాజ్యాంగ నిబంధనల ప్రకారం స్థానిక సంస్థలకు కేంద్రప్రభుత్వం అందజేసిన నిధులని తెలుస్తోంది. ఈ విధంగా వివిధ ప్రభుత్వ విభాగాల బకాయిలు రూ.23,685 కోట్లు (కేంద్ర ప్రభుత్వ విభాగాల బకాయిలు రూ.721 కోట్లతో కలిపి), దారి మళ్లించిన కరెంట్ బిల్లులు రూ.5,176 కోట్లు కలిపితే మొత్తం బకాయిలు రూ.28,861 కోట్లకు చేరాయని విద్యుత్ శాఖ ముఖ్యమంత్రికి నివేదించింది.

డిస్కంలపై పెను భారం

ఇప్పటికే తీవ్ర నష్టాల్లో ఉన్న విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లను విద్యుత్ బిల్లుల మొండి బకాయిలు మరింతగా కుంగదీస్తున్నాయి. ప్రభుత్వ బకాయిలతోనే ఉత్తర, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు (టీఎస్ఎన్పీడీసీఎల్/ టీఎస్ఎస్పీడీసీఎల్) ఏకంగా రూ.50,275 కోట్ల భారీ నష్టాలను మూటగట్టుకున్నాయని విద్యుత్ శాఖ ప్రభుత్వానికి నివేదించింది. రాష్ట్ర ప్రభుత్వంనుంచి రూ.28,140 కోట్ల విద్యుత్ బిల్లుల బకాయిలు రావాల్సి ఉండగా, మరో రూ.12,515 కోట్ల ట్రూఅప్ చార్జీలను సైతం రాష్ట్ర ప్రభుత్వం బకాయిపడింది. ఈ రెండింటినీ కలిపితే డిస్కంలకు రావాల్సిన మొత్తం బకాయిలు రూ.40,655 కోట్లకు చేరుకుంటాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ బకాయిలను చెల్లిస్తే డిస్కంల నష్టాలు రూ.9,620 కోట్లకు తగ్గిపోతాయి. వాస్తవానికి రూ.12,515 కోట్ల ట్రూఅప్ చార్జీలను వినియోగదారుల నుంచి వసూలు చేసేందుకు విద్యుత్ శాఖ ప్రయత్నించగా, ఇంతకు ముందటి బీఆర్ఎస్ ప్రభుత్వం అనుమతించలేదు. ప్రభుత్వమే వచ్చే ఐదేళ్లలో విడతల వారీగా చెల్లిస్తుందని హామీ ఇచ్చింది. కానీ, ఇప్పటి వరకు ఎలాంటి చెల్లింపులు జరపలేదని విద్యుత్ శాఖ సీఎం రేవంత్‌రెడ్డికి ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో వెల్లడించింది..

కేసీఆర్ త్వరగా కోలుకోవాలి

- **మళ్లీ ప్రజాక్షేత్రంలోకి రావాలి**
- **బీఆర్ఎస్ అధినేతకు చంద్రబాబు పరామర్శ**

టీ మీడియా, డిసెంబర్ 11, హైదరాబాద్:

టీడీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాజీ సీఎం కేసీఆర్‌ను పరామర్శించారు. సోమవారం (డిసెంబర్ 11) సోమాజీ గూడ యశోదా ఆసుపత్రికి వెళ్లిన చంద్రబాబు అక్కడ చికిత్స పొందుతున్న కేసీఆర్‌ను కలిశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ప్రజా జీవితంలోకి రావాలని, అంకిత భావంతో ప్రజలకు సేవ చేయాలని చంద్రబాబు ఆకాంక్షించారు. చంద్రబాబు వెంట పలువురు టీడీపీ నాయకులు, నేతలు ఉన్నారు. మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు ఈనెల 7 అర్ధరాత్రి బాత్రూమ్‌లో జారిపడ్డారు. తుంటి ఎముకకు గాయం కావడంతో సోమాజీగూడ యశోదా ఆస్పత్రిలో చేరారు. వైద్యులు ఆయనకు హిప్ రిప్లేస్‌మెంట్ సర్జరీ చేశారు. ప్రత్యేక వైద్యుల పర్యవేక్షణలో కేసీఆర్‌కు చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కేసీఆర్ ను సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్న రేవంత్ రెడ్డి.. మెరుగైన వైద్యం అందించాలని.. ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు తనకు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు పలువురు మంత్రులను కేసీఆర్‌ను పరామర్శించారు.

మావోయిస్టుల ఘాతుకం..

- **మందుపాతర పేలి ఇద్దరు జవాన్లకు గాయాలు**

టీ మీడియా, డిసెంబర్ 11, ఛత్తీస్‌గఢ్ :

ఛత్తీస్‌గఢ్ లో మావోయిస్టులు మరోసారి రెచ్చిపోయారు. పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బృందాలే లక్ష్యంగా మందుపాతర పేల్చారు. ఈ దాడిలో ఇద్దరు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. సుక్మా జిల్లాలోని కిస్టారం పోలీస్ స్టేషన్ పరిధిలో గల సలాటోంగ్ గ్రామ సమీపంలో సోమవారం ఉదయం 10:15 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బృందాలే లక్ష్యంగా మావోయిస్టులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. ఈ ఐఈడీ పేలుడులో సీఆర్‌పీఎఫ్‌లోని కోబ్రాకు చెందిన ఇద్దరు కమాండోలకు తీవ్ర గాయాలయ్యాయి. జవాన్లు అక్కడ జరుగుతున్న రహదారి నిర్మాణ పనుల వద్ద విధి నిర్వహణలో ఉన్న సమయంలో ఈ ఘటన జరిగినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు జవాన్లకు శిబిరంలో ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం వారిని విమానంలో ఆసుపత్రికి తరలించారు.